1969 దీపావళి కథల పోటీలో మొదటి

కోరిక

పత్రి రామసీత



బొమ్మ: శ్రీబాపు

'ఎందాకా నేమిటి ప్రయాణం?' ప్రయాణ సన్నాహంలో వున్న రావుగారిని అడిగింది మిసెస్ సుశీలారావుగారు.

'ఇక్కడికే గుంటూరు!' ముక్తసరిగా సమాధానం చెప్పారు రావుగారు.

'అహా! రిటైరయింతర్వాత ప్రయాణాల సరదా ఎక్కువైనట్టుందే. అంత కొంపలు మునిగే రాచకార్యం ఏముందక్కడ' అడిగింది ఆవిడ.

'అబ్బే మరేంలేదు. పెన్షన్ తాలుకు కాగితాలు కొన్ని కావాల్సి వచ్చింది అందుకని...'

ఈ సమాధానం ఆవిడకు తృప్తి కలిగించినట్లుంది. అందుచేత రావుగారి మాట పూర్తికాకుండానే 'ఎప్పుడొస్తారేం' అన్నది.

'ఒకటి రెండురోజుల్లో వచ్చేస్తా' అన్నారాయన.

సాధారణంగా రావుగారు ఏ పనిమీదనైనా సరే ఇంకోవూరు వెళ్లాల్సి వచ్చినప్పుడు

బహుమతి రు. 2,300 పొందిన కథ



ముందుగా ఆవిడకు తెలియజెయ్యాలి. ఉద్యోగ విరమణ చేసేటంతవరకూ ఈ నియమాన్ని ఆయన ఎన్నడూ ఉల్లంఘించే వారు కాదు. ఆ విధంగా చెప్పక పోవటం వల్ల రాగల పరిణామాలు ఆయనకు బాగా తెలుసు. కాని ఈ ప్రయాణం మిగిలిన వాటిలాంటిదికాదు. ఈ ప్రయాణం కోసరం ఆయన ఇంకో ఏడాదికి రిటైరు అవుతా రనగా సన్నాహాలు చేయ సాగారు. తను సర్వీసులో వుండగానే ఏదో పని కల్పించుకొని గుంటూరు వెళ్దామని అనుకొన్నా రాయన. కాని అది సంభవించ లేదు. ఆయనకు గుంటూర్లో చేయగల రాచ కార్యాలు ఏమీ లేవని ఆవిడకు బాగాతెలుసు. కనీసం ఆ ప్రాంతాలలో ఆయనకు సన్నిహితులైన బంధువులెవరూ లేరు. ఒకవేళ వున్నా ఆయన ఒక్కరూ వాళ్ళింటికి వెళ్ళటానికి వీలులేదు. ఆవిడ కూడా వుండాల్సిందే.

అయితే ఇప్పుడు మంచి అవకాశం లభించింది. 'పెన్షన్‌కు సంబంధించిన కాగితాలు' ఆయన చాలా జాగ్రత్తగా ఆలోచించి ఆడిన అబద్ధం. ఆయన రిటైరై కనీసం నెలైనా కాలేదు. అప్పుడే పెన్షన్ సంగతి ఎవరు పట్టించు కొంటారు. ఇంకో ఏడాదిలోపల తన చేతికి పెన్షన్ వస్తుందన్న ఆశ ఆయనకు లేదు.

తనతో కూడ ఆవిడ ప్రయాణమవుతుం దేమోనని రావుగారు ఎంతో భయపడ్డారు. ఎందుకంటే ఆయన వుద్యోగం చేసే రోజుల్లో క్యాంపుకు కూడ ఆవిడ తనతో రావాల్సిందే. ఇప్పుడు తనకు ప్రభుత్వం వారు టి. ఎ. డబ్బులు ఇవ్వటం లేదు. కాబట్టి ఆవిడ రాకపోవచ్చు అనే ఆశ ఆయనకు మిగిలింది.

ఆవిడ నిజంగా రావటం లేదని తెలిసిన తర్వాత రావుగారి ఆనందానికి అవధులు లేకపోయినాయి. ఆయనకు ప్రపంచం అంతా ఆహ్లాదకరంగా కనిపించింది. ఆయనకు నిజంగా స్వతంత్రం వచ్చి నట్లుగ భావించారు.

రైలెక్కుతూనే కిటికీదగ్గర స్థలం ఎన్నుకొని మరీ కూచున్నారు. ఆ తర్వాత తిరిగ్గా రైలు ఫ్లాట్‌ఫారంమీది అందచందాలను తిలకించేటంతలో దగ్గర్లో వేరుశెనక్కాయలు అమ్మేవాడొకడు కన పడ్డాడు. వేరుశెనక్కాయలంటే ఆయనకు చాల ఇష్టం. అయితే వాళ్ళ నాన్నగారికి అవంటే పరమ అసహ్యం. అంచేత అవి ఆయనకు అందని ద్రాక్షపళ్ళే అయ్యాయి. చిన్నప్పుడొకసారి ఆయన వాళ్ళమ్మ ఇచ్చిన కానీతో వేరుశెనక్కాయలు కొనుక్కోబోయారు. ఆ విషయం వాళ్ళ నాన్నగారికి ఎలా తెలిసిందోగాని ఆయన 'ఇంకోసారి వేరుశెనక్కాయలు కొన్నట్టు తెలిస్తే డొక్క చీరేస్తాను వెధవా' అన్నారు. ఆయన అన్నంతపని చేయగలడు కూడాను. ఆయన ఛండశాసనుడు. ఆయన మాటకు ఇంట్లోకాని ఆయన పనిచేసిన స్కూల్లోగాని తిరుగుండేది కాదు.

వేరు శెనక్కాయలు అమ్మేవాడు దగ్గరకి రాగానే ఓ పావలా వేరుశెనక్కాయలు కొన్నారు. వాడా కాయల్ని పొడుగాటి పొట్లంలో కట్టి ఇచ్చాడు. కాయలు తిందామనుకొని కంపార్టుమెంటు లోపలివైపుకు తిరిగారు. ఇప్పటివరకు ఆయన గమనించ లేదు గాని కంపార్టుమెంటులో ఆయన కాక ఇంకా ఇద్దరు ప్రయాణీకులున్నారు. వాళ్ళిద్దరూ కుతూహలంగా రావుగారి కేసి చూస్తున్నారు. కాయ వలిచి గింజ నోట్లో వేసుకుందామనుకున్న రావుగారు ఒక్కక్షణం ఆగారు. వాళ్ళిద్దరూ ఎందుకట్లా చూస్తారు. ఒకవేళ ఫస్టుక్లాసు కంపార్టుమెంటులో వేరుశెనక్కాయలు తినటం గౌరవ భంగమా! వాళ్ళేమన్నా అనుకుంటారేమో! రిటైరైపోయిన వ్యక్తి చిన్న పిల్లాడిలా వేరుశెనక్కాయలు తినటం అసహ్యంగా వుంటుంది కాబోలు. వాళ్ళకేసి సూటిగా చూడటానికి ధైర్యం చాల లేదు. తినబోతున్నవాడల్లా ఆగిపోయి పొట్లాన్ని పక్కనున్న సంచిలో పెట్టేశారు. 'ఈ వేరు శెనక్కాయలు ఆయన వెళ్ళేచోట ఒక అబ్బాయికి ఇవ్వటానికని తీసుకు వెళుతున్నాడు' అని ఆ ఇద్దరూ అనుకోవాలని ఆయన వుద్దేశం.

రావుగారు తిరిగి కిటికీలోంచి బైటకు చూస్తూ కూచున్నారు. అప్పటికి రైలు వేగం పుంజుకుంది.

వేరుశెనక్కాయలు తినటానికి వీలులేక పోయిందే అని ఆయన మనసు పీకుతూనే వుంది. వివాహానికి తను చేద్దామనుకున్న

ఏ పని సవ్యంగా జరిగిందిలేద్దూ ఆయనొకటి తలిస్తే దేముడుకాక పోవచ్చుగాని తండ్రి, భార్యమాత్రం వేరొకటి తలచేవారు. అసలాయన బి. ఎ. ప్యాసవగానే 'లా' చదువుదామనుకున్నారు. ఆ రోజుల్లో ప్లీడర్లకు మంచి గౌరవం, హోదా వుండేవి. కాని రావుగారి భవిష్యత్తు గురించి వాళ్ల నాన్నగారు అంతకు ముందే ఒక పథకంవేసి స్థిరపరిచారు.

ఆ పథకం ప్రకారం రావుగారు సబ్‌కలెక్టరుగారి ఏకైక పుత్రికని పెళ్లిచేసుకోవాలి. మామగారు అల్లుడికి రెవిన్యూ డిపార్టుమెంటు వుద్యోగం ఇప్పించాలి. రావుగారి ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండానే ఆ పథకం అమలు జరిగిపోయింది. తండ్రిగారి శిక్షణలో తనకేం కావాల్సిందీ తనకన్నా తలిదండ్రులకే ఎక్కువ తెలుసుననే విషయాన్ని బాగా ఆకళింపు చేసుకున్నారు. అయినా ఈ వివాహానికి తద్వారా రాబోయే రెవిన్యూ డిపార్టుమెంటు వుద్యోగానికి తన అయిష్టాన్ని సూచనప్రాయంగా వ్యక్తం చేసారు రావుగారు. వాళ్ల నాన్నగారు గంయ్యిమన్నారు. 'బోడితెలివితేటలూ నువ్వూ. నీకు వుద్యోగాలగురించి ఏం తెలుసంట అసలు ? నోరు మూసుకుని చెప్పినట్టు విను' అన్నారాయన.

కోరిక

వివాహమయిన మరుక్షణమే రావుగార్ని సబ్‌కలెక్టరుగారు పిలిచి 'చూడు నాయనా నాకు ఒక్కగా నొక్కపిల్ల. దాని ఇష్టానికి వ్యతిరేకంగా మా ఇంట్లో ఏపని జరగదు. దానిమనసు ఏ మాత్రం కష్టపడినట్టనిపించినా మేమెవరము సహించలేము. ఎట్లా చూసుకుంటావో మరి' అన్నారు.

రైలు రాజమండ్రిలో ఆగింది. 'వీళ్లిద్దరూ ఇక్కడ దిగిపోతే బాగుండును వేరుశెనక్కాయలు తినవచ్చు' అనుకున్నారు రావుగారు. వాళ్లు దిగలేదు సరికదా ఇంకో మనిషి వచ్చి ఎక్కాడు. ఆ వచ్చి నాయన రావుగారిని పలకరించాడు 'ఎందాకానేవిటి' అంటూ.

'ఇక్కడికే గుంటూరు, మీరో' అన్నారు రావుగారు మర్యాదకు. 'హైదరాబాదు' అన్నాడాయన.

కంపార్టుమెంటులోవున్న ఇద్దరూ తనకు తెలిసినవాళ్లు కాదు. వాళ్లేమనుకుంటే తనకేం వేరుశెనక్కాయలు తినేద్దాం అనుకున్నారు ఇప్పటివరకు రావుగారు. కాని మూడోమనిషి కొంచెం ముఖపరిచయం గలవాడవటంచేత ఆపని చేయటానికి సాహసించలేక పోయారు.

ఈరకమైన ఆటంకాలు, ఆశాభంగాలు ఆయనకు కొత్త కాదు. వివాహమైన కొత్తలో సినిమాకు వెళ్లటం విషయంలో పేచీవచ్చింది ఇద్దరికీ. భర్తగా తన అధికృత నిరూపిద్దామని ఏమైనాసరే 'మాలపిల్ల' చూడటానికి వీలులేదు 'కృష్ణరాయబారం' నాటకం చూద్దాం అన్నారాయన.

అంతే, ఆతర్వాత పరిస్థితులు చాలా తీవ్రంగా పరిణమించాయి. సన్నిహితులందరిచేత చివాట్లు తిన్నారాయన. అప్పట్నుంచి మామగారింట్లో రావుగారికి గల స్థానము, గౌరవమూ క్రమక్రమంగా దిగజారుతూ వచ్చాయి. ఆరోజునుంచి ఆయన ఏనాడూ భార్యమాటకు ఎదురు చెప్పలేదు. మొదట్లో తండ్రికట్టడినుంచి దూరంగా వెళుతున్నామగదా అని సంతోషించారాయన. ఆయన ఎన్నో పథకాలు వేసుకున్నారు. తన వ్యక్తిత్వాన్ని తీర్చి దిద్దుకునే అవకాశం లభించిందనుకున్నారు. కాని తండ్రి కట్టడిలోనైనా కనిపించే ఆప్యాయత, ప్రేమ మామగారింట్లో ఛాయా మాత్రంగానైన గోచరించ లేదాయనకు. ఆ ఇంట్లో ఆయనొక ఆటవస్తువు. చెప్పినది తు. చ. తప్పకుండ మాత్రమే చేయటం చేతనయిన బొమ్మ.

కాని...ఎడారి అయిపోయిన ఆయన జీవితంలో ఒకే ఒక ఒయాసిస్సు. కలలాగ గడిచిపోయిన రోజులవి. గుంటూర్లో గడిపిన ఏడాదిన్నర ఆయన హృదయాంతరాళాల్లో పదిలంగా భద్రపరచుకున్న జ్ఞాపకాలు. ఆ జ్ఞాపకాల పుటలను ఎప్పుడూ తిరగేస్తూనే వుంటారు. అంతకు మించి ఆయన చేయగలిగిందేమీ లేదు.

రెవిన్యూ ఇనస్పెక్టరుగా ఆయన్ను గుంటూరు ట్రాన్స్‌ఫర్ చేసారని తెలియగానే 'నేనా దరిద్రపు వూరికి ఛస్తే రాను' అన్నది ఆయన భార్య.

గుంటూర్లో రావుగారు మర్చిపోలేని స్థలాలు గాంధిపార్కు, అరండల్‌పేట, బాంబే టాకీసు, రత్నహాలు, కొత్తపేటలో రాజమ్మ భోజనహోటలు. ఆఫీసు లేనప్పుడు, ఏమీ తోచనప్పుడు, ఎక్కడైన తిరుగుతూనో ఏదైన సినిమాగాని, నాటకంగాని చూస్తూనో లేకపోతే గాంధిపార్కులో గోళ్లు గిల్లుకుంటూ కూర్చోటమో చేస్తూ



వుండేవారు. రాత్రి ఏ ఎనిమిది గంటలకో రాజమ్మ హోటల్లో భోంచేసి గదికి చేరు కునేవారు.

రైలు ఏలూర్లో ఆగింది. ప్లాట్‌ఫారం నిండా జనం చాలామంది వున్నారు. రావు గారి దృష్టి ఒక నల్లటి అమ్మాయిమీద పడింది. ఆ అమ్మాయి తన పక్క కంపార్టుమెంటులో ఎక్కడానికి ప్రయత్ని స్తోంది. ఆ అమ్మాయిని చూడగానే రాజమ్మ జ్ఞాపకం వచ్చింది.

ఆ రోజుల్లో రాజమ్మ కూడ ఇట్లాగే వుండేది. ఇప్పుడెట్లా వుందో. ఆవిడ భర్త కొంచెం వెర్రిబాగులవాడు. అంచేత ఆవిడే మొగపని ఆడపని చేసుకోవలసి వచ్చేది. అతనుమాత్రం హోటలు అరుగుమీద వచ్చే పోయే వాళ్లని చూస్తూ కూచునేవాడు.

రాజమ్మ తనంటె మొదటినుంచీ ఎంతో అభిమానం చూపించేది. గుంటూరు కారం తను తినలేక పోయేవాడు. అందుకని కారం తక్కువ వేసిన పదార్థాలు తనకోసం తీసి వేరే పెట్టేది. తను ఎంత ఆలస్యంగా భోజనానికి వచ్చినా విసుక్కోకుండా అన్నం పెట్టేది.

ఈ అభిమానాన్ని పురస్కరించుకొని

కోరిక

తనే తొందర పడ్డాడో లేకపోతే ఆవిడే తనని ప్రోత్సహించిందో తన కిప్పుడైతే జ్ఞాపకం లేదుగాని ఆవిడ తన కక్కడ భార్యలేని లోటు తీర్చింది.

ఈ విషయం స్ఫురణకు రాగానే రావు గారికి కొంచెం సిగ్గు వేసింది. చిరునవ్వు నవ్వారు. ఇప్పుడెట్లా వుందో! తనని గుర్తు పట్టుతుందో లేదో! అదేం ఆలోచన? ఎలా మర్చిపోగలదు?

తొందరలోనే తనను తిరిగి కాకినాడ ట్రాన్స్‌ఫర్ చేసారు. తర్వాత ఆయ నెప్పుడూ గుంటూరు వెళ్లలేదు.

తనతోపాటు రాజమ్మ హోటల్లో భోం చేసిన తోటి గుమాస్తా ఒకాయన ఉత్తరం రాస్తూ రాజమ్మకు మొగపిల్లవాడు పుట్టి నట్లుగా తెలియ చేసాడు. ఆయన చాలా సంతోషించాడు. అయితే ఆ వుత్సాహాన్ని ఆయన మనసులోనే అట్టే పెట్టుకోవాల్సి వచ్చింది.

తనకిప్పుడు మొగపిల్లలు లేరు. ఉన్న ఇద్దరూ ఆడపిల్లలే. మనవడి కోసం కలవ రించి మామగారు ఆ కోరిక తీరకుండానే కాలం చేసారు.



గుంటూరు చేరేవరకు ఆయన మనస్సులో రకరకాల వూహాలు మెదలసాగాయి. రాజమ్మ ప్రస్తుతం ఏవిధంగా వుంటుందో వూహిం చేరు. ఆమెతో సంభాషణ ఎట్లా మొదలు పెట్టాలో మిగిలిన విషయాలు ఎల్లా మాట్లాడాలో రకరకాల సంభాషణలను వూహించి అందులో తను బాగా వుందను కున్న సంభాషణను రెండుమూడుసార్లు మననం చేసుకున్నారు.

అయితే తను కుర్రవాణ్ణి ఎట్లా పలక రించాలో ఆయనకు తెలియలేదు. తను తీసుకు వచ్చిన రెండువేల రూపాయలు తీసు కునేందుకు ఆవిడ అంగీకరిస్తుందో లేదో! అప్పుడావిడను ఏవిధంగా ఒప్పించాలి అన్న విషయాలు ఆయనకు తీరని సమస్యగానే మిగిలిపోయాయి.

ఈ రెండువేల రూపాయలు ఆయన ఒక ఏడాదిగా పోగుచేసిన డబ్బు. ఈ విషయం తన భార్యకు కూడా తెలియకుండ జాగత్త పడ్డారాయన. తన అభిమానాన్ని వ్యక్తం చేసేందుకు ఇంతకంటే మరో మార్గం కనపడ లేదు. ఇంతకన్న ఎక్కువగా గాని, మరోవిధంగా గాని తన అభిమాన్ని ప్రేమను వ్యక్తం చేయటం చేతకాని వ్యక్తి తను. అట్లాగని ఏమీ చేయకుండా వూరుకునేందు కాయన మనసు అంగీకరించ లేదు. అందుకనే ఈ ప్రయాణం.

ఆయనకు తెలిసిన గుంటూరుకు ఇప్పుడు చూస్తున్న గుంటూరుకు గల తేడా ఆయన్ను ఆశ్చర్యంలో ముంచి వేసింది. రాజమ్మకూడా ఇట్లాగే మారిపోయిందా ఏం! అనుకున్నారాయన.

హోటల్లో సామాను పెట్టి తనకు తెలిసిన దార్లను గుర్తు చేసుకుంటూ కొత్త పేటకు నడిచి వెళ్లారు.

అదివరకటి రాజమ్మ హోటలు స్థానే ఒకపెద్ద భవనం వున్నది అక్కడ హోటలు వున్న గుర్తులేం లేవు. ఒకవేళ రాజమ్మ ఇక్కణ్నుంచి వెళ్లిపోయిందేమో నన్న ఆలోచన ఆయనకు మొదటిసారిగా స్ఫురిం చింది.

దగ్గర్లోవున్న ఒక కిళ్లీకొట్టువాణ్ణి అడిగారు, రాజమ్మ హోటలు గురించి.

'ఆ ఇల్లేనండి, ఆవిడ హోటలు ఎత్తేసి చాలా రోజులయింది. ఇప్పుడావిడ కొడుకు పుగాకు వ్యాపారం చేస్తున్నాడుగా'

అన్నాడు కిళ్లీకొట్టు ఆసామీ.

రావుగారిలో ఏదో తెలియని భయం ఆవేశించింది. ఒక క్షణం తటపటాయించారు. అయినా ధైర్యం కూడగట్టుకుని ఆ ఇంటికి వెళ్లి తలుపు తట్టారు.

ఒక కుర్రవాడు తలుపు తీసి లోపలికి వచ్చి కూర్చోమన్నాడు. లోపలికి వెళ్లి ఒక సోఫాలో కూర్చున్నారు రావుగారు. ఆ గది అంతా ఖరీదైన సామాన్లతో చాలా ఆధునికంగా అలంకరించబడి వుంది. ఆ వాతావరణం పరిశీలించిన మీదట ఆయనలో ఆవేశించిన భయం ఎక్కువైంది.

రాజమ్మ మనుమలు కాబోలు ఇద్దరు పిల్లలు వచ్చి ఆయనకేసి తదేక దీక్షగా చూస్తున్నారు. రావుగారు నవ్వటానికి ప్రయత్నించారు. వాళ్లను దగ్గరకు రమ్మని పిలిచారు. వాళ్లు ఏమీ మాట్లాడకుండా అట్లాగే చూస్తూ నిలుచుండిపోయారు.

'ఎవరు కావాలండీ' అన్న పిలుపు ఆయన్ను ఈ లోకంలోకి తీసుకు వచ్చింది. గుమ్మానికి ఆనుకుని రాజమ్మ నిలుచుని వున్నది.

రావుగారికి సమాధానం ఏమి చెప్పాలో తోచలేదు. పైగా ఆయన వూహించని ప్రశ్న ఇది. తనకు అఖండమైన స్వాగతం లభిస్తుందని, తనను చూడగానే రాజమ్మ 'మీరా! రండి, రండి' అని ఆశ్చర్యంతో ఆహ్వానిస్తుందని ఊహించారేగాని, ఇటువంటి ప్రశ్నకు సమాధానం చెప్పవలసి వస్తుందని అనుకోలేదు.

ఎదురుగుండా సాక్షాత్తూ రాజమ్మ మంచుని వుంది. తను ఊహించిన రాజమ్మకు ఈవిడకు చాలా తేడా వుంది. నెరుస్తున్న జుట్టు, తెల్లటి చీర, వంటినిండా నగలతో వున్న ఆవిడను చూసి రావుగారికి నోటమాట రాలేదు.

'ఎవరు కావాలండీ' అని ఆవిడే మళ్లా అడిగింది.

'అబ్బే, ఏం లేదు, మాది కాకినాడ, నేను ఇదివరలో ఇక్కడ పనిచేసిన రోజుల్లో మీ హోటల్లో భోంచేసేవాడిని, పనిమీద ఈ వూరొచ్చాను, వూరికే చూసి పోదామని...అంతే' అన్నారాయన.

'అట్లాగా, సంతోషమండి. ఏదో బోటి వారి దయవల్ల ఈ వాడిట్లా వున్నాం' అన్నది ఆవిడ.

తరువాత ఏం మాట్లాడాలో రావుగారికి తోచలేదు. ఆయన వూహించుకున్న సంభాషణ మర్చిపోయారు. ఆవిడ తనను గుర్తించిందో లేదో తెలియదు. గుర్తించి కూడా పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకోకుండా వుండాలని ప్రయత్నిస్తోందా; అనేది అర్థం కాలేదు. జీవితంలో చివరిసారి తన ఓటమిని అంగీకరించక తప్పలేదు రావుగారికి.

రెండు నిమిషాలు భారంగా గడిచిపోయాయి.

'వస్తానండి' అని లేచారు.

వీధిలోకి వచ్చి నాలుగడుగులు వేసాక తను ఆ ఇంట్లో హాండుబాగ్ మర్చిపోయినట్లు గుర్తుకు వచ్చి వెనక్కు వెళ్లారు.

తను ఇందాక చూసిన ఇద్దరు పిల్లలూ తన సంచీలోని వేరుశెనక్కాయల పొట్లం తీసుకుని కాయలు పంచుకుంటున్నారు. ●